నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, ఆదివారం 26 జనవరి 2025 | SURYAPET

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట(దేవరకొండ), జనవరి 25 : బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్‌ను ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ తాజా పరిస్థితులను కేసీఆర్‌కు వివరించినట్లు రవీంద్రకుమార్ తెలిపారు.

మళ్లీ ఎదురుచూపులే..

మరోసారి ప్రభుత్వ పథకాల వాయిదా

- మార్చి చివరి నాటికి అందరికీ అని తాజా ప్రకటన
- నేడు ఒక్కో మండలంలో ఒక్క గ్రామానికే పరిమితం
- కొత్త దరఖాస్తుల పరిశీలన పేరుతో అమలు వాయిదా
- ప్రభుత్వ తీరుపై లబ్ధిదారుల మండిపాటు
- అసలు ఇచ్చేదా! లేదా? అంటూ సందేహాలు
- నేడు గుండ్లపల్లిలో ప్రారంభించనున్న మంత్రి కోమటిరెడ్డి
- లబ్ధిదారులకు మాత్రమే ప్రవేశానికి ఆదేశాలు

మర్రిగూడ మండలం కొట్టాల గ్రామంలో శనివారం రాత్రి సర్వే చేస్తున్న అధికారులు

నల్లగొండ ప్రతినిధి, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 26న అత్యంత పవిత్రమైన దేశ 75వ గణతంత్ర దినోత్సవం నుంచి రాష్ట్రంలోని అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని కాంగ్రెస్ సర్కారు కొద్దిరోజులుగా హడావుడి చేస్తున్నది. నాలుగు రోజుల పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా, ఆర్భాటంగా నిర్వహించిన గ్రామసభల్లో సైతం లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించింది. ఈ జాబితాల్లోని లబ్ధిదారులంతా ఇక తమకు ఆదివారం నుంచి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆశించారు. కానీ తీరా రాష్ట్ర ప్రభుత్వం చావు కబురు చల్లగా చెప్పింది. సరిగ్గా ఒక రోజు ముందు శనివారం ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ గణతంత్ర దినోత్సవం రోజున కేవలం మండలంలోని ఒక్క గ్రామంలోనే పథకాలను అమలు చేస్తామని యూటర్న్ తీసుకోవడం కలకలం రేపుతున్నది. మిగతా గ్రామాల లబ్ధిదారులకు వచ్చే నెల మొదటివారం నుంచి మార్చి చివరి నాటికి రెండు నెలల పాటు దశల వారీగా అమలు చేస్తామని చెప్పడం పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. అసలు ఈ ప్రభుత్వానికి ఎన్నికల్లో ఇచ్చిన హామీల పట్ల, పథకాల అమలు పట్ల చిత్తశుద్ధి ఉందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అధికారంలోకి వచ్చి వెనువెంటనే ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తామని ప్రచార సమయంలో, వంద రోజుల్లో అన్నీ అమలు చేస్తామని పాలన పగ్గాలు చేపట్టిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కానీ ఏడాది పాలన పూర్తయినా ప్రజలకు మాత్రం నిరీక్షణ తప్పడం లేదు. అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన తప్ప చేసిందేమీ లేదన్న తీవ్ర అసంతృప్తిలో ప్రజలు మండిపడుతున్నారు. ఇక ఈ ఏడాది ఆరంభం నుంచి త్వరలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తామని ప్రకటిస్తూ వచ్చారు. సంక్రాంతికి ముందు సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు అందిస్తామని వెల్లడించారు. ప్రజలంతా నిజమే అనుకుని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే సమయంలో గ్రామ సభల పేరుతో ఈ నెల 21 నుంచి 24వ తేది వరకు హడావుడి చేశారు. కానీ గ్రామసభల్లో ప్రభుత్వం ఊహించింది ఒకటైతే ప్రజల నుంచి వచ్చిన స్పందన మరోలా ఉంది. నాలుగు రోజుల పాటు జరిగిన గ్రామసభల్లో నిలదీతలు... అడ్డగింతలు... ఆగ్రహావేశాలే ఎదురయ్యాయి. జాబితాల్లోని లబ్ధిదారుల్లో ఎక్కువ మంది అనర్హులే ఉన్నారని ఆయా గ్రామాల్లోని పేదలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులు చేసుకున్నా తమ పేర్లు ఎందుకు లేవని అధికారులను నిలదీశారు. దాంతో ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో కొత్తగా దరఖాస్తులకు అవకాశం కల్పించక తప్పలేదు. జాబితాల్లో పేర్లు రాని అర్హులంతా మరోసారి దరఖాస్తులు చేసుకున్నారు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే నాలుగు రోజుల పాటు జరిగిన గ్రామసభల్లో కొత్తగా ప్రజల నుంచి 1,17,644 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో రైతుభరోసా కోసం 844, రేషన్‌కార్డుల కోసం 53,844, ఇందిరమ్మ ఇండ్ల కోసం 47,471, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కోసం 15,485 ఉన్నాయి. వాస్తవానికి ప్రభుత్వం ఇప్పటికే ఆయా పథకాలకు ఎంపిక చేసిన లబ్ధిదారుల సంఖ్య కంటే కొత్తగా వచ్చిన దరఖాస్తుల సంఖ్య రెట్టింపు ఉండడం గమనార్హం. వెల్లువలా వచ్చిన కొత్త దరఖాస్తులతో ప్రభుత్వ వర్గాలు సైతం కంగుతిన్నట్లు తెలిసింది. కొత్త దరఖాస్తులను పరిగణలోకి తీసుకోకుంటే ప్రస్తుత లబ్ధిదారులకు వర్తింప చేసినా ప్రభుత్వానికి పెద్దగా ప్రయోజనం ఉండదని భావిస్తున్నట్లు సమాచారం. దాంతో నేటి నుంచి అన్ని గ్రామాల్లో అమలు కావాల్సిన పథకాలను కొత్త దరఖాస్తుల పరిశీలన పేరుతో మరో రెండు నెలల పాటు సాగదీసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నది. ఈ నేపథ్యంలోనే నేడు ప్రతి మండలంలో ఒక్క గ్రామంలోనే నాలుగు పథకాలను గ్రౌండింగ్ చేసేలా ఆదేశాలు ఇచ్చింది. దాంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికారులంతా శనివారం రోజంతా కసరత్తు చేశారు. సాయంత్రానికి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి నివేదించారు. దాని ప్రకారం ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎంపిక చేసిన గ్రామాల్లోనే లబ్ధిదారులకు పథకాలను అందజేయనున్నారు. నల్లగొండ మండలం గుండ్లపల్లిలో రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పథకాల గ్రౌండింగ్‌ను ప్రారంభించనున్నారు.

ఎంపిక చేసిన లబ్ధిదారులకే ఎంట్రీ

నాలుగు రోజుల పాటు గ్రామసభల్లో ఎదురైన నిలదీతలు, అడ్డగింతలు, తిరుగుబాట్లతో ప్రభుత్వం పూర్తిగా అల్టర్ అయినట్లు తెలుస్తున్నది. అందులోభాగంగా ఆదివారం నాలుగు పథకాలను ప్రారంభించనున్న గ్రామాల్లో అనధికార ఆంక్షలకు ప్రభుత్వం సిద్ధమైనట్లు విశ్వాసనీయ సమాచారం. పథకాల ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనేలా ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు అన్ని నియోజకవర్గాల్లోని ఒకటో, రెండో గ్రామాల్లో ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాలో లేని ఇతర అర్హులు ఆందోళనకు దిగే అవకాశాలు లేకపోలేదు. ఈ నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలకు సిద్ధమవుతున్నారు. ఆదివారం పథకాలను ప్రారంభించనున్న గ్రామాల్లో కేవలం లబ్ధిదారులకు మాత్రమే ఎంట్రీ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొనున్న గుండ్లపల్లి కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులు మాత్రమే ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇలా చెప్పడమంటే ఇక ఇతరులకు ఈ కార్యక్రమంలోకి అనుమతిలేనట్లేనని స్పష్టమవుతున్నది. పథకాల వారీగా కూడా రేషన్ కార్డు లబ్ధిదారులకు తాసీల్దార్, రైతుభరోసాకు ఏఓ, ఇందిరమ్మ ఇండ్లను ఎంపీడీఓ, ఆత్మీయ భరోసాకు ఏపీఓలు బాధ్యత తీసుకుంటూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. మరోవైపు ఆందోళనల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో భారీ పోలీసు బందోబస్తు కూడా చేపట్టనున్నట్లు సమాచారం. దాంతో ఉమ్మడి జిల్లా అంతటా పథకాల ప్రారంభ కార్యక్రమాలు ఉత్కంఠతను రేకెత్తిస్తున్నాయి.

నల్లగొండ జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాలు ఇవే..

మండలం	గ్రామం
అడవిదేవులపల్లి	ముదిమాణిక్యం
అనుముల (హాలియా)	కొరవాణిగూడెం
చందంపేట	తెల్దేవర్‌పల్లి ఆవా
చండూరు	ఉడతలపల్లి
చింతపల్లి	నెల్వలపల్లి
చిట్యాల	వట్టిమర్తి
దామరచర్ల	రాజగట్టు
దేవరకొండ	మైనంపల్లి
గుండ్లపల్లి	టి.గౌరారం
గుర్రంపోడు	జునుత్తల
కనగల్	తేలుకంటిగూడెం
కట్టంగూర్	చెరువు అన్నారం
కేతేపల్లి	కొర్లపహాడ్
కొండమల్లేపల్లి	చెన్నమనేని పల్లి
మాడ్గులపల్లి	దాచారం
మర్రిగూడ	కొట్టల
మిర్యాలగూడ	రుద్రారం
మునుగోడు	గుండ్లోరిగూడెం
నకిరేకల్	నెల్లిబండ
నల్లగొండ	గుండ్లపల్లి
నాంపల్లి	నెవిళ్లగూడెం
నార్కట్‌పల్లి	బి.వెల్లెంల
నేరేడుగొమ్ము	పందిరిగుండు తండా
నిడమనూరు	తుమ్మడం
పెద్ద అడిశర్లపల్లి	కాసమనేనిపల్లి
పెద్దవూర	కొత్తలూర్
శాలిగౌరారం	తుడిమిడి
తిప్పర్తి	తానేదార్‌పల్లి
త్రిపురారం	కంపలపల్లి
తిరుమలగిరి (సాగర్)	నాయకుని తండ
వేములపల్లి	అన్నపురెడ్డిగూడెం

ట్రిపుల్ ఆర్‌పై రైతన్న రణం

అలైన్‌మెంట్ మార్చాలని కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన

- ముందు అనుమతి ఇచ్చి.. తెల్లారేసరికి టెంట్‌ను ఎత్తేసిన పోలీసులు
- బారికేడ్లు, ఇనుప కంచెలతో రైతుల అడ్డగింత
- ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత క్యామ మల్లేశ్, ఎంపీ లక్ష్మణ్



కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

నిరసనకారులు కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

భువనగిరి అర్బన్, జనవరి 25 : ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలని బాధిత రైతులు కదం తొక్కారు. రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం మహా ధర్నా చేపట్టారు. ధర్నా కోసం ముందుగానే డీసీపీ రాజేంద్రచంద్రకు వినతిపత్రం సమర్పించగా, అనుమతించారు. దాంతో రైతులు శుక్రవారం రాత్రి నుంచే మహాధర్నాకు సంబంధించిన ఏర్పాట్లలో భాగంగా టెంట్లు, కార్పెటుల, ఇతర వసతులను ఏర్పాటు చేసుకున్నారు. కాగా, తెల్లవారే సరికి పోలీసులు ధర్నా స్థలంలో వేసిన టెంట్లు, కార్పెట్లను ఎత్తివేశారు. రైతులు కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా భువనగిరి-రాయగిరి రహదారిలో బారికేడ్లు, ఇనుప కంచెలు ఏర్పాటుచేసి రహదారిని దిగ్బంధించారు. దాంతో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ నాయకులతో కలిసి ట్రిపుల్ బాధిత రైతులు రోడ్డుపైనే ధర్నా చేశారు. అలైన్‌మెంట్ మార్చాలని నినదించారు. కలెక్టరేట్ లోపలికి వెళ్లి తమ సమస్యను విన్నవించుకుంటామని రైతులు కోరినా పోలీసులకు వినకుండా అడ్డుకుని తోసేశారు. మహిళా రైతులను కూడా అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ధర్నా నిర్వహించవద్దని, కలెక్టరేట్‌లోకి వెళ్లొద్దని రైతులను, రైతుల పక్షాన ధర్నాలో పాల్గొనేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్‌ను డీసీపీ రాజేశ్ చంద్ర అడ్డగించారు. ప్రభుత్వం రైతుల సమస్యను కనీసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అధికారులకైనా విన్నవించుకునే అవకాశం కల్పించకపోతే రైతులు పరిస్థితి ఏంటని పైళ్ల ప్రశ్నించడంతో కేవలం నాలుగురికి అవకాశం ఇస్తామని డీసీపీ చెప్పారు. దాంతో ఇద్దరు రైతులతో కలిసి మాజీ ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, క్యామ మల్లేశ్ కలెక్టరేట్‌లోకి వెళ్లారు. అప్పటికే కలెక్టరేట్‌లో ఉన్న ఎంపీ లక్ష్మణ్‌తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో బీఆర్ఎస్ నాయకులు ఎనబోయిన ఆంజనేయులు, జనగాం పాండు, గాదె నరేందర్‌రెడ్డి, సిద్దుల పద్మ, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాగారం సూరజ్, అబ్బగాని వెంకట్, రైతులు పాల్గొన్నారు.

అలైన్‌మెంట్ మారుస్తామన్న వాళ్లు ఎటుపోయారు

ఎన్నికల ప్రచారంలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తామని మాయ మాటలు చెప్పి వాగ్దానాలతో గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీ ఎటుపోయారోనని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్ మార్చుతామని ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీ నిజం కాదా అని నిలదీశారు. ట్రిపుల్ బాధిత రైతులు ఎమ్మెల్యే కుంభం వద్దకు పోతే కనీసం సమయం ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఎంపీ దగ్గరికి పోతే నాకేం తెల్వదు.. అంతా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికే తెలుసు అంటూ మాట దాటేస్తున్నారని విమర్శించారు. దక్షిణ భాగం ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్‌లో మర్చినప్పుడు.. ఉత్తర భాగంలో రాయగిరి వద్ద అలైన్‌మెంట్ మార్చించాలనే ఆలోచన ఇక్కడున్న ప్రజాప్రతినిధులకు ఎందుకు వస్తలేదని ప్రశ్నించారు. అలైన్‌మెంట్ మార్చే వరకూ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీని అడ్డుకుంటామన్నారు. రాయగిరి ప్రజలు, రైతులు అండర్‌పాస్, బైపాస్, విద్యుత్ లైన్ ఏర్పాటుతో ఎంతో నష్టపోయారని, ట్రిబుల్ఆర్‌తో మరింత దెబ్బతింటారని ఆవేదన వ్యక్తం చేశారు.

–పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

అలైన్‌మెంట్ మార్చకుంటే ఆందోళనలు ఉధృతం

ట్రిపుల్ఆర్ అలైన్‌మెంట్ మార్చకుంటే ధర్నాలు, ఆందోళనలు ఉధృతం అవుతామని బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ హెచ్చరించారు. ట్రిబుల్ఆర్ బాధిత రైతులకు న్యాయం చేయాలని ధర్నా చేయడం, అధికారులకు విన్నవించడం తప్పా అని ప్రశ్నించారు. బారికేడ్లు, పోలీసులతో రైతులను అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు.

– క్యామ మల్లేశ్, బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి

కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

మల్లగారి శ్రీనివాస్, పిట్టల అశోక్‌కు బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల, సునీత, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

బీబీనగర్, జనవరి 25 : యాదాద్రి భువనగిరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాస్, బీజేపీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల అశోక్‌తోపాటు వారి అనుచరులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్, బీజేపీలో ఉన్న వీరు ఆ పార్టీల విధివిధానాలు నచ్చకపోవడంతోపాటు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరారు. భువనగిరిలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి సమక్షంలో వారు గులాబీ కండువా కప్పుకొన్నారు.

చిట్యాల పోలీస్ స్టేషన్ ఆవరణలో బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి నిరసన

- బీఆర్ఎస్ కార్యకర్తపై అక్రమంగా పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్

చిట్యాల, జనవరి 25 : మండలంలోని వనిపాకల గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్తపై జరిగిన దాడి ఘటనలో దాడి చేసిన వారిపై కాకుండా ఇరువర్గాలపై పోలీసులు కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శనివారం చిట్యాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిరసన తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని బీఆర్ఎస్ కార్యకర్తపై కాంగ్రెస్ వారు దాడి చేసిన ఘటనలో బాధితుడు చావుబతుకుల మధ్య ఉంటే దాడి చేసిన వారితో పాటు బాధితుడిపై కూడా కేసు ఎలా పెడుతారని సీఐని ప్రశ్నించారు. నకిరేకల్ సీఐ రాజశేఖర్, చిట్యాల ఎస్ఐ ఎన్. ధర్మతో కొద్ది సేపు వాగ్వాదం జరిగిన తరువాత బయటకు వచ్చి స్టేషన్ ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు అధికార పార్టీకి తలొగ్గి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, బాధితుడిపై కేసును ఎత్తేసే వరకు ఇక్కడి నుంచి వెళ్లనని భీష్మించుకొని కూర్చున్నారు. ఈ నెల 23న రాత్రి ఘటన జరిగితే శనివారం ఉదయం దాడి చేసిన వారు దొంగ కట్లు కట్టించుకొని వచ్చి తమపై కూడా దాడి చేశారని నాటకాలు అడతున్నారని ఆరోపించారు. పోలీసులు నమ్మి దవాఖానలో చికిత్స పొందుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేయటం అన్యాయమన్నారు.

ఇప్పటి వరకు నిందితులను అరెస్టు చేయక పోవడమేంటని ప్రశ్నించారు. అనంతరం ఎస్ఐ నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డితో చిరుమర్తికి ఫోన్‌లో మాట్లాడించగా.. ఇరువర్గాలపై కాకుండా దాడి చేసిన వారిపైనే కేసు నమోదు చేయాలని చిరుమర్తి డిమాండ్ చేశారు. అందుకు డీఎస్పీ విచారణ అనంతరం చట్ట ప్రకారం కేసులు చేస్తానని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. ఆయన వెంట మెండె సైదులు, కొలను వెంకటేశం, సుంకరి యాదగిరి, పొన్నం లక్ష్మయ్య, బాలగోని రాజు, జిట్ట బొందయ్య, ఆగు అశోక్, కందాటి అశోక్‌రెడ్డి, కొలను సతీశ్, చిత్రగంటి ప్రవీణ్, జిట్ట శేఖర్, శ్రీశైలం, మోకిడి వినయ్, నర్రా శ్రీకాంత్‌రెడ్డి, దగ్గుల సైదులు, బొలుగూరి సైదులు పాల్గొన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ఓటు పౌరుల ప్రాథమిక హక్కు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, జనవరి 25 : భారత రాజ్యాంగం పౌరులకు కల్పించిన ప్రాథమిక హక్కు ఓటు అని, దీన్ని 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు వేయడం పౌరులు బాధ్యతగా భావించాలన్నారు. ఈ సందర్భంగా అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి గుర్తింపు కార్డులను అందించారు. పలువురు అధికారులకు మెమెంటోలు, ఎన్నికల అపరేటర్లుగా విధులు నిర్వహించిన11 మంది ఉద్యోగులకు, 20 మంది బీఎల్ఓలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, వేణుమాధవ్ పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- 9 మంది నిరుద్యోగుల నుంచి రూ.45.10 లక్షలు వసూలు
- పోలీసుల అదుపులో నిందితులు
- రూ.1.50లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం : డీఎస్పీ

మిర్యాలగూడ, జనవరి 25 : ఉద్యోగాలు ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి 9 మంది నుంచి రూ.45.10లక్షలకు పైగా వసూలు చేసిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ రాజశేఖర్ రాజు శనివారం తెలిపారు. సూర్యాపేటకు చెందిన ఖాసీం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన రాసపుత్ర రాఘవేందర్, మిర్యాలగూడ పట్టణం వాసవీనగర్‌కు చెందిన రాళ్లపల్లి శ్రీధర్, హైదరాబాద్‌కు చెందిన ఎడ్లచంద్రయ్య, మిర్యాలగూడకు చెందిన రాళ్లపల్లి నారాయణ, రాళ్లపల్లి పార్వతమ్మ కలిసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. నల్లగొండ జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లో నిరుద్యోగ యువతను టార్గెట్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి వారి వద్ద నుంచి స్టడీ సర్టిఫికెట్స్ తీసుకొని వివిధ శాఖల్లో ఉద్యోగాలు వచ్చాయని నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. ఈ క్రమంలో మిర్యాలగూడ పట్టణానికి చెందిన వేముల వంశీకి హోంగార్డ్ జాబ్ ఇప్పిస్తామని చెప్పి రూ.12లక్షలు, మరో మహిళ వేమూరి రేణుకకు ఏఎన్ఎం కాంట్రాక్ట్ జాబ్ ఇప్పిస్తానని రూ.3లక్షలు, ఖమ్మం పాటి పుష్పలతకు ప్రభుత్వ పాఠశాలలో అటెండర్ జాబ్ ఇప్పిస్తానని రూ.1.10లక్షలు, రంగారెడ్డి జిల్లా కులకచర్లకు చెందిన సంగరమోని శ్రీనివాసులుకు, సంగరమోని హనుమంతుకు హోంగార్డ్ ఉద్యోగం ఇప్పిస్తామని రూ.6లక్షలు, సూర్యాపేట జిల్లా సజ్జాపురం తండాకు చెందిన నాగరాజుకు రైతు రుణాల రికవరీ ఏజెంట్ జాబ్ కోసం రూ.1.50లక్షలు, కనగల్ మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన సంపత్‌రెడ్డికి కాంట్రాక్టర్ మ్యాన్ పవర్ ఏజెన్సీ ఇప్పిస్తామని రూ.2.50లక్షలు అదే విధంగా మాడ్గులపల్లి మండలం మాచినపల్లికి చెందిన పగిళ్ల శంకర్‌కు కాంట్రాక్టర్ కంప్యూటర్ జాబ్ కోసం రూ.7లక్షల చొప్పున మొత్తం 9 మంది నుంచి రూ.45.10లక్షలను వసూలు చేశారు. వీరికి ఆయా శాఖల్లో ఉద్యోగాలు వచ్చాయని అపాయింట్‌మెంట్ ఆర్డర్లు కూడా అందించారు. అయితే అవి నకిలీవని తెలుసుకున్న బాధితులు తాము మోసపోయామని తెలుసుకొని తమ డబ్బు తిరిగివ్వాలని నిలదీయడంతో చంపేస్తామని బెదిరింపులకు దిగారు.

దీంతో పట్టణానికి చెందిన వేముల వంశీ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇన్‌చార్జి సీఐ నాగార్జున ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పట్టణంలోని విద్యానగర్‌లోని గ్రామీణ ఉద్యోగ సేవా కేంద్రం అనే కార్యాలయంలో ఇద్దరు నిందితులు రాసపుత్ర రాఘవేందర్, రాళ్లపల్లి శ్రీధర్ ఉన్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, కొన్ని రెస్యూమ్స్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు ఖాసీం, ఎడ్ల చంద్రయ్య, రాళ్లపల్లి నారాయణ, రాళ్లపల్లి పార్వతమ్మ పరారీలో ఉన్నారని, వీరిని కూడా త్వరలోనే అరెస్ట్ చేసి పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. ఇద్దరు నిందితులను కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నాగార్జున, ఎస్ఐ సైదిరెడ్డి ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం

పాత ఎస్పీ ఆఫీస్‌లో పూర్తయిన గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు

*76వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సూర్యాపేట జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 8.55 నిమిషాలకు జాతీయ ప